క్లుప్తంగా

చిత్తశుద్ధితో వలంటీర్ల సేవలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: గ్రామ వలంటీర్లు చిత్తశుద్ధితో సేవలందించాలని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తెలిపారు. శుక్రవారం ఆయన గాదిరాయిలో గ్రామ వలంటీర్లతో సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఇటు అధికారులకు అటు ప్రభుత్వానికి వారధిగా పని చేయాలని సూచించారు. అనంతరం ఆయన స్థానిక ఎంపీపీ, హైస్కూలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పర్రె రామునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న రామ్మూర్తి విగ్రహావిష్కరణ



గోడపత్రికలను విడుదల చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి అప్పారావు, తదితరులు

కె.కోటపాడు: పీడిత ప్రజల హక్కుల సాధన కోసం తన గొంతు వినిపించిన బహుజన కళాయోధుడు గొల్ల రామ్మూర్తి అని బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి కాటపల్లి అప్పారావు తెలిపారు. ఈ నెల 11న రామ్మూర్తి స్వగ్రామం విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం పోతంపేటలో ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం ఆయన ఆనందపురంలో విడుదల చేశారు. దళిత నాయకులు జేసుదాస్, బొత్స ఎరకయ్య, పాల్తేటి అప్పారావు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

చీడికాడ: శిరిజాం శివారు ఎల్.ఎస్.పురంలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఇంటింటా కుళాయి ఏర్పాటులో భాగంగా నీటి సరఫరా నిమిత్తం రూ.30 లక్షలతో ట్యాంకు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈ ఎ.సూర్యనారాయణ, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మాకవరపాలెం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని వెలుగు ఏపీఎం చినబాబు తెలిపారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మాకవరపాలెంలో రక్తహీనతపై గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై వైద్య సిబ్బంది వివరించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని ఏఎన్ఎం సత్యరాజు సూచించారు. వెలుగు సీసీ శ్రీరాం పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అంచనా

రోలుగుంట: బరువు గణన ద్వారానే చిన్నారుల ఆరోగ్యంపై అంచనా వేస్తున్నామని ఐసీడీఎస్ రోలుగుంట సెక్టార్ సూపర్‌వైజర్ పెట్ల సత్యవతి తెలిపారు. కంచుగుమల, అడ్డసరం, తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల కార్యకర్తలకు చిన్నారుల ఆరోగ్య జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడారు. బరువు తక్కువగా ఉన్నవారి తల్లిదండ్రులకు వివరించి నెలనెలా వారి ఆరోగ్యాభివృద్ధిపై అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా రుద్ర హోమం

మాకవరపాలెం: పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం వైభవంగా జరిగింది. శివుడికి ఇష్టమైన ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లక్ష్మి, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు

- మేడిచర్లలోని గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రొంగలినాయుడుపాలెం-మేడిచర్ల తారు రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



మేడిచర్లలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడిచర్లలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరించడంతోపాటు వారు తెలిపిన సమస్యలకు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆధార్‌లో తన వయస్సు తక్కువగా నమోదు కావడం వల్ల పింఛన్ పొందలేకపోతున్నట్లు గ్రామానికి చెందిన పూడి పెదరమణ వాపోయాడు. వెంటనే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. తన కుటుంబానికి మూడేళ్లలో సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, సామాజిక పింఛన్ ద్వారా రూ.1.28 లక్షల లబ్ధి కలిగినట్లు రావాడ నాగభూషణం ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటి కుళాయి ఏర్పాటుకు రూ.80 లక్షలు మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

రొంగలినాయుడుపాలెం-మేడిచర్ల తారురోడ్డు ప్రారంభం

రొంగలినాయుడుపాలెం నుంచి గొర్రుపోటువానిపాలెం మీదుగా మేడిచర్ల వరకు 1,800 మీటర్ల మేర రూ.1.93 కోట్లతో నిర్మించిన తారురోడ్డును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. సుదీర్ఘకాలంగా ఇక్కడ ప్రజలు మట్టిరోడ్డుపైనే రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడటంతో బీటీరోడ్డు నిర్మించానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజలు ఘనంగా సన్మానించారు. అనంతరం మేడిచర్లలో రూ.21.50 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి లక్ష్మి, వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, ఎంపీడీవో శచీదేవి, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి బాలాజీ అప్పారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు మల్లంపాలెంలో..

మల్లంపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శచీదేవి తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారన్నారు.

రబీకి రైతాంగం సన్నద్ధం

- పెద్దేరు జలాశయంలో పుష్కలంగా సాగునీరు
- ఆర్బీకేల ద్వారా విత్తనాల విక్రయం



పెద్దేరు జలాశయంలో సాగునీరు



వంటర్లపాలెంలో అపరాలు చల్లుతున్న రైతు

మాడుగుల రూరల్: ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొని ఖరీఫ్ పంటను ఒడ్డుకు చేర్చుకున్న రైతన్నలు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఖరీఫ్ వరి కోతలు కోసిన వెంటనే నీటి ఆధారిత ప్రాంతంలో వరినారు మడులు సిద్ధం చేశారు. పెద్దేరు జలాశయంలో ఆశించిన మేర సాగునీరు ఉండటంతో రెట్టించిన ఉత్సాహంగాతో సాగుకు ఉపక్రమించారు. పంట కోత సమయంలో పెసర, మినప, పిల్లి పెసర, వంటి అపరాలు జల్లారు. ఈ క్రమంలో 4,600 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తారని అంచనా. ప్రస్తుతం వరి నారు వేశారు. మరో 15 రోజుల వ్యవధిలో జలాశయం అధికారులు సాగునీరు విడుదల చేయనున్నారు. రబీ వరి విత్తనాలు రెండు మాసాల క్రితం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి పంట ఆశించిన మేర పండింది. జలాశయం ఆయకట్టు పరిధిలో సత్యవరం, జె.డి.పేట, ఒమ్మలి, వి.జె.పురం, కింతలి, వల్లాపురం, అవురువాడ, జాలంపల్లి, పొన్నవోలు గ్రామాల్లో రబీ వరి నారు మడులు సిద్ధం చేశారు. మరికొన్ని గ్రామాల్లో ఇప్పటికే వరి నారు పెరిగింది. అదేవిధంగా తాటిపర్తి తారకరామ జలాశయం పరిధిలోని తాటిపర్తి, కాశీపురం, ఎం. కోడూరు, తదితర గ్రామాల్లో రబీ వరినారు మడులు సిద్ధం చేశారు. దీంతోపాటు వ్యవసాయ మోటారు పంపుసెట్లు అవకాశమున్న చోట ఎరుకువాడ, రెవెన్యూ పరిధిలో రబీ వరి నాట్లు వేయడానికి గాను నారుమడులు సిద్ధం చేశారు.

సంక్షేమ పాలనలో ప్రజల ఆనందం

మట్టవానిపాలెంలో గడపకు గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మట్టవానిపాలెంలో మహిళలు సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: ప్రజల సమస్యలు పరిష్కరించడానికే గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మట్టవానిపాలెంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ క్రమంలో జగనన్న పాలనలో ఇంటికే వచ్చి పథకాలు ఇస్తున్నారని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ మధ్యలో నుంచి ముస్లిం శ్మశానవాటికను వేరొక చోటకు తరలించాలని, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. దీనికి ఆయన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ పైలా రాజు, ఎంపీడీవో వెంకన్న, తహసీల్దారు మహేశ్వరావు, ఆగ్రో అడ్వయిజర్ కమిటీ చైర్మన్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టరు గుమ్మడి సత్యదేవ్, వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, మత్స భవానీ ప్రసాదు, చోడవరం ఏఎంసీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, గుడివాడ సర్పంచ్ గుమ్మాల శంకర్, ఎంపీటీసీ సభ్యుడు కరణం అప్పారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే నిధులు ఖర్చు చూపిస్తారా?

మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం



పరిపాలనాధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో పనులు చేయకుండా నిధులు ఖర్చు చేసినట్లు కాగితాల్లో చూపించడంపై మండల ప్రజా ప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వార్షిక బడ్జెట్‌ను అధికారులు ప్రవేశ పెట్టారు. అనంతరం గత సంవత్సరంలో సాంఘిక సంక్షేమం కోసం రూ.5,13,900 ఖర్చు చేసినట్లు పరిపాలనాధికారి శ్రీనివాసరావు వివరించగా, వీటిని ఏ గ్రామంలో ఖర్చు చేశారని జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి వెంకట రమణ, ఇంటి అప్పారావు తదితర్లు నిలదీశారు. స్త్రీ శిశు సంక్షేమం కోసం రూ.3,67,100 ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించి పనులు చేయకపోవడంపై పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే ఈ నిధులు ఖర్చు చేయాలని ఎంపీడీవో సువర్ణరాజును కోరారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తురకలపూడి ఆస్పత్రి స్టాఫ్‌నర్స్‌ను ఐదు నెలల క్రితం తుంపాల ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై పంపడంతో వైద్య సేవలు అందడం లేదని పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ అప్పలనాయుడు వాపోయారు. కోతుల నిర్మూలనకు జాప్యంపై బంగారుమెట్ట పీఏసీఎస్ అధ్యక్షుడు సాయం రమేష్, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని చింతపాక సర్పంచ్ గొలజాన శ్రీను, వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీ పనులకు అనుసంధానం చేసి ఆదుకోవాలని పోలేపల్లి సర్పంచ్ సీతా పైడియ్యనాయుడు, వడ్డాదిలో రూ. 70 లక్షలతో డ్రైనేజీ పనులు సంక్రమంగా చేయకపోవడంపై వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, విద్యుత్ స్తంభాలు పనులు చేయకపోవడంపై దిబ్బిడి సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, పెదపూడి సర్పంచ్ గోకివాడ వరకృష్ణ ఆయా శాఖల అధికారులను నిలదీశారు. సభ్యులు అడిగిన పనులు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందు పలు గ్రామాలకు చెందిన మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు బదులు వారి కుటుంబ సభ్యులు పాల్గొనడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. తహసీల్దార్ అంబేడ్కర్, డీఈ మోహన్, కోఆప్షన్ సభ్యుడు కె. అచ్చింనాయుడు పాల్గొన్నారు.

15 లోగా పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించండి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

చోడవరం: పీఎం కిసాన్ పథకానికి ఈ నెల 15లోగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. స్థానిక ఏడీ కార్యాలయంలో ఐదు మండలాల ఏవోలతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ప్రతీ రైతు రబీ సీజన్ పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకునేలా చైతన్య పరచాలన్నారు. రైతులు ఎక్కడికీ ధాన్యాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైతుల వద్దకే వ్యవసాయ సిబ్బంది వచ్చి ధాన్యం సేకరిస్తారన్నారు. మామిడి, జీడి, ఇతర ఉద్యానవన పంటల రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం చోడవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో వైఎస్ అగ్రిల్యాబ్‌ను పరిశీలించారు. చోడవరం వ్యవసాయ సహాయక సంచాలకుడు రవీంద్రనాథ్, చోడవరం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలాల ఏవోలు, ఆర్‌బీకేల సహాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలు చేస్తే సీజ్ చేస్తాం

తనిఖీ చేసిన ఆర్డీవో భవానీశంకర్



నర్సీపట్నంలోని పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీశంకర్

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలోని పలు పెట్రోల్ బంకుల్లో ఆర్డీవో భవానీశంకర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్ బంక్‌ల్లో మోసాలపై స్పందనలో వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతను, మీటరు రీడింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోల్ బంకుల్లోని ప్రస్తుతం స్టాక్, రికార్డుల్లో నమోదైన స్టాక్ వ్యత్యాసం చూశారు. వినియోగదారులను మోసం చేసినట్లు రుజువైతే బంకులను సీజ్ చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. పారదర్శకమైన సేవలు అందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వి.వి.రమణ, సివిల్ సప్లయి అధికారులు పాల్గొన్నారు.

నేడు తాత్కాలిక చెరకు కాటా ప్రారంభం

తెనుగుపూడిలో పరిశీలించిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు



పరిశీలిస్తున్న ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు, బూరె బాబూరావు

దేవరాపల్లి: తెనుగుపూడిలో తాత్కాలిక చెరకు తూనిక కేంద్రాన్ని (కాటా) డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ప్రారంభించనున్నట్లు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ వి. సన్యాసినాయుడు తెలిపారు. ఈ మేరకు సీడీవో కలిమి రాము, ఉద్యోగుల యూనియన్ నాయకులు భాస్కరరావు, బి. కింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, స్థానిక ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడుతో కలిసి శుక్రవారం ఆయన కాటాను పరిశీలించారు. ఇక్కడ తాత్కాలిక చెరకు కాటాను నిర్మించాలని తెనుగుపూడి, వెంకటరాజుపురం, మారేపల్లి, వాకపల్లి, గరిశింగి తదితర గ్రామాల రైతులు డిప్యూటీ సీఎంను కోరిన వెంటనే ఫ్యాక్టరీ అధికారులు పది రోజుల వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఫ్యాక్టరీ సివిల్ ఇంజినీర్ గూనూరు ప్రకాశ్, కాటా ఇంజనీర్ వేపాడ అప్పారావు, కాటా ఏవో కృష్ణమూర్తి, ఫీల్డ్ సిబ్బంది దుస్య వెంకటరమణ, బేరా నారాయణరావు, కాటా సిబ్బంది బుగత బాబూరావు, రమేష్ తదితర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



దివ్యాంగ చిన్నారి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న డీఆర్వో వెంకటరమణ

రోలుగుంట: బుచ్చింపేటకు చెందిన రెడ్డి శ్రీను, మల్లిక దంపతుల కుమార్తె రామలక్ష్మిఅనూష(1)కు సీఎం సహాయ నిధి నుంచి రూ. లక్ష మంజూరైంది. ఈ బాలిక పుట్టకతోనే దివ్యాంగురాలు, బధిర సమస్యతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు వైద్యం చేయించలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు సీఎం మంజూరు చేసి లక్ష రూపాయలను చెక్కు రూపంలో డీఆర్వో వెంకటరమణ అనకాపల్లిలో శుక్రవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. సీఎం, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, సర్పంచ్, ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉలబాల రాములకు కృతజ్ఞతలు తెలిపారు.

తులసీరావుకు ఘన నివాళి

రోలుగుంట: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పాడిరైతులకు తీరని లోటని పాల ఉత్పత్తిదారులు, పాలకేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొండపపాలెం -1వ కేంద్రం అధ్యక్షుడు బంటు వెంకటరమణ, కార్యదర్శి లచ్చబాబు, రెండో కేంద్రం అధ్యక్షుడు బంటు పరదేశి, కార్యదర్శి జోగాడ వెంకటరమణ, రోలుగుంట ఒకటో కేంద్రం అధ్యక్షుడు రుత్తల శ్రీను, కార్యదర్శి మద్దు నర్సింహమూర్తి, రెండో కేంద్రం అధ్యక్షుడు శెట్టి శ్రీను, కార్యదర్శి మద్దు వాసుదేవరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎంపీపీ యర్రంశెట్టిలతోపాటు ఆయా పాలకేంద్రాల అధ్యక్ష, కార్యదర్శులు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు.

వడదెబ్బ బాధిత కుటుంబానికి పరిహారం



బాధితురాలికి నగదు మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ, నాయకులు

బుచ్చెయ్యపేట: దిబ్బిడి గ్రామానికి చెందిన వడదెబ్బ మృతుడు గొటివాడ అప్పారావు భార్య లక్ష్మికి నగదు మంజూరు పత్రాన్ని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు శుక్రవారం అందజేశారు. 2021 మే నెలలో గ్రామానికి చెందిన అప్పారావు తురకవాని చెరువులో ఉపాధి పనులు చేస్తుండగా వడదెబ్బకు గురై కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో అతడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 వేల పరిహారం మంజూరు చేసింది. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకరి శ్రీను, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీవో మురళి, వీఆర్పీ గొంపా వరహామూర్తి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చుతున్నాం

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



నవరత్నాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



జమీల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నాతవరం: ఎన్నికల హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నాతవరం గ్రామ సచివాలయం -1లో ఆయన శనివారం ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాలతోపాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒకటి, రెండో వార్డులో అధిక శాతం టీడీపీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు మంజూరు కావడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా వార్డుల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై మొరపెట్టుకోగా, సంబంధిత అధికారులను పిలిచి పరిష్కరించాలని సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, తహసీల్దార్ పి.కనకారావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, నాతవరం -1, 2 సెగ్మెంట్ ఎంపీటీసీలు కరక రేణుక, చెక్కా జోగిరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, గన్నవరం, పీకేగూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చేర్ల వరహాలబాబు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సబ్బవరపు వెంకునాయుడు, ఉలబాల శ్రీను, సిద్దాబత్తుల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, పోలుపర్తి వెంకటరమణ, టి. లోవకృష్ణ, ఇనపసప్పల పుష్ప పాల్గొన్నారు.

నేడు నాతవరంలో..

నాతవరం సచివాలయం -1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఎమ్మెల్యే గణేష్ పాల్గొంటారన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌వో కామేశ్వరి

మాడుగుల రూరల్: నీటి నిల్వలు ఉన్న చోట దోమలు చేరి మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, వాటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కె.జె.పురం పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి. కామేశ్వరి తెలిపారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆరు ఆరోగ్య ఉప కేంద్రాల్లో దోమలు నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎం. కోటపాడు, ఎం. కె. వల్లాపురం గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ అధికారి, ఎంపీటీసీలు, సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ఇళ్ల ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఆరోగ్య పర్యవేక్షకురాలు పుష్పకాంతం, ఏఎన్ఎం పుష్ప, ఆశ కార్యకర్త సత్యవతి పాల్గొన్నారు. మాడుగుల -1వ సెగ్మెంటు పరిధిలో ఎంపీటీసీ సభ్యురాలు పోలిమేర విజయలక్ష్మి ఇంటి వద్ద ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

అర్హులకు పథకాలు అందకపోతే చర్యలు

మాడుగుల: అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు. సత్యవరం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశమయ్యారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకపోతే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. ఇంటింటా కుళాయి నీటి సరఫరా గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

చెరకు తరలింపులో జాప్యంపై రైతుల ఆందోళన



వడ్డాది కాటా వద్ద ఆందోళనకు దిగిన రైతులు

బుచ్చెయ్యపేట: వడ్డాది చెరకు కాటా యార్డు నుంచి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి సకాలంలో చెరకు తరలించడం లేదని పలువురు రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఇక్కడ కాటా వద్ద రైతులు శిరిగిరిశెట్టి చిన వెంకటయ్యదొర, అద్రట్రా వెంకటరావు, సత్యనారాయణ, లింగంపల్లి శోభనబాబు, వర్రి సత్తిబాబు, శిరిగిరిశెట్టి భవాని తదితర్లు సిబ్బంది తీరుపై ఆగ్రహించారు. రోజుకు ఫ్యాక్టరీకి 150 టన్నుల చెరకు తరలించాలన్నారు. 4న 88 టన్నులు, 5న 76 టన్నులు మాత్రమే తరలించారని వాపోయారు. దీనివల్ల చెరకు ఎండకు ఎండిపోయి సుక్రోజ్ శాతం తగ్గి నష్టపోతున్నామని, అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదని వాపోయారు. తక్షణమే ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి ఆదుకోవాలన్నారు. దీనిపై కేన్ ఇన్‌స్పెక్టర్ మధును వివరణ కోరగా లారీలను రప్పించి చెరకు తరలింపునకు చర్యలు చేపడతామన్నారు.